03-01-2021 ఉదయము మురళి ఓంశాంతి " అవ్యక్త బాప్‌దాదా "
రివైజ్ -05-10-1987 మధువనము

---

" బ్రాహ్మణ జీవితం యొక్క సుఖము - సంతుష్టత మరియు ప్రసన్నత "

ఈ రోజు బాప్‌దాదా నలువైపులా ఉన్న తమ అతి ప్రియమైన, అపురూపమైన బ్రాహ్మణ పిల్లలలో విశేష బ్రాహ్మణ జీవితం యొక్క విశేషతా సంపన్నమైన పిల్లలను చూస్తున్నారు. ఈ రోజు అమృతవేళలో బాప్‌దాదా సర్వ బ్రాహ్మణ కుల పిల్లలలో ఎవరైతే సదా సంతుష్టత గుణం ద్వారా స్వయం కూడా సదా సంతుష్టంగా ఉండి, ఇతరులకు కూడా తమ దృష్టి, వృత్తి, కృతి ద్వారా సదా సంతుష్టతను అనుభవం చేయిస్తూ వచ్చారో ఆ విశేషమైన ఆత్మలను ఏరుకుంటున్నారు. కనుక ఈ రోజు సదా ఎవరైతే సంకల్పంలో, మాటలో, సంఘటన యొక్క సంబంధ-సంపర్కంలో, కర్మలో సంతుష్టత యొక్క గోల్డన్ పుష్పాలు బాప్‌దాదా ద్వారా తమపై వర్షిస్తున్నట్లు అనుభవం చేస్తూ అంతేకాక సర్వుల పట్ల సంతుష్టత యొక్క గోల్డన్ పుష్పాల వర్షం సదా కురిపిస్తున్న సంతుష్ట మణుల మాల గుచ్చుతున్నారు (తయారు చేస్తున్నారు). ఇటువంటి సంతుష్ట ఆత్మలు నలువైపుల నుండి ఎక్కడో ఒకరు కనిపిస్తున్నారు. మాల పెద్దదిగా అవ్వలేదు. చిన్న మాల తయారయింది. బాప్‌దాదా పదే పదే సంతుష్టమణుల మాలను చూసి హర్షిస్తున్నారు ఎందుకంటే ఇటువంటి సంతుష్టమణులే బాప్‌దాదా కంఠహారంగా అవుతారు, రాజ్య అధికారులుగా అవుతారు అంతేకాక భక్తులు స్మరించే మాలగా అవుతారు.

బాప్‌దాదా ఇతర పిల్లలను కూడా చూస్తున్నారు. వీరు అప్పుడప్పుడు సంతుష్టంగా (తృప్తిగా), అప్పుడప్పుడు అసంతుష్ట సంకల్ప ఛాయలోకి వచ్చి మళ్ళీ వెలుపలికి వచ్చేస్తారు, చిక్కుకోరు. మూడవ రకం పిల్లలు ఒకసారి సంకల్పాల అసంతుష్టత, ఒకసారి స్వయం వారంతకు వారే అసంతుష్టంగా, ఒకసారి పరిస్థితుల ద్వారా అసంతుష్టత, ఒకసారి స్వంత ఆందోళన ద్వారా అసంతుష్టత, ఒకసారి చిన్న పెద్ద మాటల ద్వారా అసంతుష్టత - ఈ చక్రములోకి వస్తూ, వెలుపలికి వస్తూ మళ్ళీ చిక్కుకుంటూ ఉంటారు. ఇటువంటి వారి మాల కూడా చూశారు. కనుక మూడు మాలలు తయారయ్యాయి. మణులేమో అందరూ మణులే కాని సంతుష్టమణుల ప్రకాశము, ఇతర రెండు ప్రకారాల మణుల ప్రకాశము ఎలా ఉంటుందో మీరు కూడా తెలుసుకోగలరు. బ్రహ్మాబాబా పదే పదే మూడు మాలలను చూస్తూ హర్షిస్తూ, రెండవ మాలలోని మణులు మొదటి మాలలోకి రావాలని ప్రయత్నం కూడా చేస్తున్నారు. బాప్‌దాదాల మధ్య వారిని గురించి ఆత్మిక సంభాషణ జరుగుతూ ఉంది ఎందుకంటే రెండవ మాలలోని కొన్ని మణులు చాలా కొద్దిగా అసంతుష్టత ఛాయా మాత్రంగా ఉన్న కారణంగా మొదటి మాలలోకి రాకుండా వంచితులుగా ఉండిపోయారు.

వారిని పరివర్తన చేసి ఎలాగైనా మొదటి మాలలోకి తీసుకు రావాలని ప్రయత్నిస్తున్నారు. ఒక్కొక్క గుణము, విశేషతలు, సేవ అన్నిటిని ముందుకు తెస్తూ మాటిమాటికి ఈ మణిని మొదటి మాలలోకి తెస్తామని అంటున్నారు. ఇటువంటి మణులు సుమారు 25-30 మంది ఉన్నారు. వీరిని గురించి బ్రహ్మాబాబా విశేషంగా శివబాబాతో ఆత్మిక సంభాషణచేస్తున్నారు. ఈ మణులను కూడా మొదటి నంబరు మాలలో వేయాలని చెప్తున్నారు. కాని స్వయం బ్రహ్మాబాబానే మందహాసం చేస్తూ తండ్రి వీరిని తప్పకుండా మొదటి మాలలోకి తీసుకొచ్చి చూపిస్తారని అంటున్నారు. ఇటువంటి మణులు కూడా ఉన్నారు.

ఇలా ఆత్మిక సంభాషణ నడుస్తున్న సమయంలో అసంతుష్టతకు విశేషమైన కారణమేది అను విషయం వచ్చింది. సంగమయుగ విశేషతే సంతుష్టత అయినప్పుడు, వరదాత ద్వారా వరదానాన్ని ప్రాప్తి చేసుకున్న వరదాని ఆత్మలు రెండవ నంబరు మాలలోకి ఎందుకు వచ్చారు? సర్వ ప్రాప్తులకు బీజము సంతుష్టత. స్థూలము లేక సూక్ష్మ అప్రాప్తికి బీజము అసంతుష్టత. బ్రాహ్మణుల ఖజానాలో లేక బ్రాహ్మణ జీవితంలో అప్రాప్తి వస్తువేదీ లేదు అనే గాయనం కూడా ఉంది. అయినా అసంతుష్టత ఎందుకు? వరదాత వరదానాలివ్వడంలో తేడా చూపించారా లేక తీసుకునేవారు తేడాగా తీసుకున్నారా? ఏం జరిగింది? వరదాత, దాత భండారము సంపన్నంగా, భర్‌పూర్‌గా ఉంది. ఎంత భర్‌పూర్‌గా ఉందంటే



చాలాకాలం బ్రహ్మాకుమార-బ్రహ్మాకుమారీలుగా అయిన శ్రేష్ఠ నిమిత్త ఆత్మల 21 జన్మల వంశావళి వారు, వారి భక్తులు, ఆ భక్తుల వంశావళి వారు కూడా ఆ ప్రాప్తుల ఆధారము పైననే నడుస్తూ ఉంటారు. ఇంత పెద్ద ప్రాప్తి అయినా అసంతుష్టత ఎందుకు? తరగని ఖజానా అందరికీ ప్రాప్తి అయింది. ఒక్కరి ద్వారానే, ఒకే విధంగా, ఒకే సమయంలో, ఒకే పద్ధతి ద్వారా లభించింది. అయితే ప్రాప్తించిన ఖజానాలను ప్రతి సమయం కార్యంలో

ఉపయోగించడం అనగా స్మృతిలోఉంచుకోరు. నోటితో సంతోషిస్తారు కాని హృదయంతో సంతోషించరు. దిమాగ్(బుద్ధి) ద్వారా సంతోషముంది, మనసులో ఖుషీ లేదు, కారణమేమి? ప్రాప్తుల ఖజానాలను స్మృతి స్వరూపంగా అయి కార్యంలో ఉపయోగించరు. స్మృతి ఉంటుంది కాని స్మృతి స్వరూపంలోకి రారు. ప్రాప్తి అమితమైనది (బేహద్) కాని దానిని అక్కడక్కడ హద్దు ప్రాప్తిలోకి పరివర్తన చేసుకుంటారు. అందువలన హద్దు అనగా అల్పకాలిక ప్రాప్తులపై కోరిక, సదా సంతుష్టత అనుభూతి అయ్యే బేహద్ ప్రాప్తి యొక్క ఫల స్వరూపం నుండి వంచితం చేసేస్తుంది. హద్దు ప్రాప్తి హృదయాలలో హద్దు వేసేస్తుంది. అందువలన అసంతుష్టత అనుభవమవుతుంది. సేవలో హద్దు వేసేస్తారు ఎందుకంటే హద్దు కోరిక యొక్క ఫలము, మనసు కోరుకునే ఫలము(మన్ ఇచ్ఛిత ఫల్) ప్రాప్తించదు. హద్దు కోరికల ఫలము అల్పకాలానికి పూర్తి చేసేదిగా ఉంటుంది. అందువల్లనే ఇప్పటికిప్పుడే సంతుష్టత, ఇప్పటికిప్పుడే అసంతుష్టత కలుగుతుంది. హద్దు, బేహద్ నశాను అనుభవమవ్వనివ్వదు. అందువలన మానసిక అనగా స్వయం సంతుష్టత, సర్వుల సంతుష్టత అనుభవమవుతోందా అని విశేషంగా చెక్ చేసుకోండి.

సంతుష్టతకు గుర్తు - వారు మనసుతో, హృదయంతో, అందరితో, తండ్రితో, డ్రామాతో సంతుష్టంగా (తృప్తిగా) ఉంటారు. వారి మనసులో, శరీరంలో సదా ప్రసన్నత యొక్క అల కనిపిస్తుంది. ఎటువంటి పరిస్థితి వచ్చినా, ఎవరైనా లెక్కాచారము చుక్త చేసుకునే ఆత్మ ఎదిరించేందుకు ముందుకు వస్తూ ఉన్నా, శారీరిక కర్మభోగము ఎదుర్కొనేందుకు వస్తూ ఉన్నా, హద్దు కోరిక నుండి ముక్తంగా ఉండే ఆత్మ సంతుష్టత కారణంగా సదా ప్రసన్నతా ప్రకాశంతో ప్రకాశిస్తూ ఉన్న నక్షత్రము వలె కనిపిస్తుంది. ప్రసన్నచిత్తులు ఎప్పుడూ ఏ విషయంలోనూ ప్రశ్నచిత్తులుగా అవ్వరు. ప్రశ్నలుంటే ప్రసన్నంగా ఉండలేరు. ప్రసన్నచిత్తుల గుర్తు - వారు సదా నిస్వార్థులుగా ఉంటారు, సదా అందరినీ నిర్దోషులుగా అనుభవం చేస్తారు, ఇతరులపై దోషమును ఆరోపించరు. నా భాగ్యాన్ని ఇలా తయారు చేశాడని భాగ్యవిధాతపై గాని, డ్రామాలో నా పాత్రయే ఇలా ఉందని డ్రామాపై గాని, వీరి స్వభావ-సంస్కారం ఇలా ఉందని వ్యక్తులపై గాని, ప్రకృతి యొక్క వాయుమండలం ఇలా ఉందని ప్రకృతిపై గాని, నా శరీరమే ఇలా ఉందని శారీరిక లెక్కాచారాలపై గాని దోషముంచరు. ప్రసన్నచిత్తులనగా సదా నిస్వార్థ, నిర్దోష వృత్తి, దృష్టి గలవారు. కనుక సంగమ యుగము యొక్క విశేషత సంతుష్టత. సంతుష్టతకు గుర్తు ప్రసన్నత. ఇది బ్రాహ్మణ జీవితము యొక్క విశేష ప్రాప్తి. సంతుష్టత లేదు, ప్రసన్నత లేదంటే బ్రాహ్మణులుగా అయ్యే లాభము తీసుకోలేదు. బ్రాహ్మణ జీవితము యొక్క సుఖమే సంతుష్టత, ప్రసన్నత. బ్రాహ్మణ జీవితం తయారయింది కాని దాని సుఖము తీసుకోకుంటే నామామాత్రపు బ్రాహ్మణులుగా అయ్యారా లేక ప్రాప్తి స్వరూప బ్రాహ్మణులుగా అయ్యారా?కనుక బాప్‌దాదా

బ్రాహ్మణ పిల్లలందరికి ఇదే స్మృతినిప్పిస్తున్నారు - బ్రాహ్మణులుగా అయ్యారు, అహో సౌభాగ్య ము! కాని బ్రాహ్మణ జీవిత వారసత్వము, ప్రాపర్టీ(ఆస్తి) సంతుష్టత. బ్రాహ్మణ జీవిత పర్సనాలిటీ ప్రసన్నత. ఈ అనుభవం నుండి ఎప్పుడూ వంచితులుగా ఉండరాదు. మీరు అధికారులు. ఇప్పుడు దాత వరదాత విశాల హృదయంతో ప్రాప్తుల ఖజానాలు ఇస్తున్నారు, ఇచ్చేశారు. కనుక మీ ఆస్తిని, పర్సనాలిటీని అనుభవంలోకి తీసుకు రండి, ఇతరులకు కూడా అనుభవం చేయించండి. అర్థమయిందా? ప్రతి ఒక్కరు స్వయాన్ని -" నేను ఏ నంబరు మాలలో ఉన్నాను? మాలలో అయితే ఉన్నాను కాని ఏ నంబరు మాలలో ఉన్నాను? " అని ప్రశ్నించుకోండి. అచ్ఛా.



ఈ రోజు రాజస్థాన్ మరియు యు.పి గ్రూపులున్నాయి. రాజస్థాన్ అనగా రాజుల సంస్కారముండేవారు. ప్రతి సంకల్పము, స్వరూపంలో రాజుల సంస్కారాన్ని ఆచరణలో సుకొచ్చేవారు అనగా ప్రత్యక్షంగా చూపించేవారు. అటువంటివారినే రాజస్థాన్ నివాసులని అంటారు. అలా ఉన్నారు కదా? ఎప్పుడైనా ప్రజలుగా అయిపోరు కదా? ఒకవేళ వశీభూతులుగా అయితే ప్రజలని అంటారు. మాలికులంటే రాజులు. ఒకప్పుడు రాజులుగా, ఒకప్పుడు ప్రజలుగా అవ్వరాదు. సదా రాజుల సంస్కారము స్వతహాగానే స్మృతిస్వరూపంలో ఉండాలి. ఇటువంటి రాజస్థాన్ నివాసి పిల్లలకు కూడా మహత్వముంది. రాజును అందరూ సదా ఉన్నతమైన దృష్టితో చూస్తారు. రాజుకు స్థానం కూడాఉన్నతమైనది ఇస్తారు. రాజులు సదా సింహాసనంపై కూర్చుంటారు, ప్రజలు సదా క్రింద కూర్చుంటారు. కనుక రాజస్థాన్‌లోని రాజ సంస్కారము గల ఆత్మలు అనగా సదా ఉన్నత స్థితిలోఉండేవారు. ఇలా అయ్యారా లేక అవుతున్నారా? అయినారు, సంపన్నంగా అవ్వనే అవ్వాలి. రాజస్థాన్ మహిమ తక్కువదేమీ కాదు. స్థాపనా కార్యము జరుగునప్పుడు ముఖ్యకేంద్రము రాజస్థాన్‌లోనే ఉంది. కనుక ఉన్నతమయింది కదా. పేరు కూడా ఉన్నతమైనదే, కార్యము

కూడా ఉన్నతమైనదే. ఇటువంటి రాజస్థాన్ పిల్లలు తమ ఇంటికి చేరుకున్నారు. అర్థమయిందా?

యు.పి(ఉత్తర ప్రదేశ్) భూమి విశేషంగా పావన భూమి అని మహిమచేయబడింది. భక్తిమార్గంలో పావనంగా చేసే గంగానది కూడా ఇక్కడే ఉంది. అంతేకాక భక్తి లెక్కతో కృష్ణుని భూమి కూడా యు.పిలోనే ఉంది. భూమికి చాలా మహిమ ఉంది. కృష్ణ లీల, జన్మభూమి చూడాలనుకున్నా యు.పిలోకే వెళ్తారు. కనుక యు.పి వారికి విశేషత ఉంది. సదా పవిత్రంగా అయి ఇతరులను పావనంగా చేసే విశేషతా సంపన్నంగా ఉంది. ఎలాగైతే తండ్రికి పతితపావనుడనే మహిమ ఉందో.... అలా యు.పి వారి మహిమ కూడా బాప్ సమానమైనది. మీరు పతితపావనీ ఆత్మలు. భాగ్య నక్షత్రము ప్రకాశిస్తూ ఉంది. ఇటువంటి భాగ్యవాన్ స్థానము మరియు స్థితి - రెండిటికి మహిమ ఉంది. సదా పావనం - ఇది స్థితి యొక్క మహిమ. కనుక ఇటువంటి భాగ్యశాలురమని స్వయాన్ని భావిస్తున్నారా? సదా మీ భాగ్యాన్ని చూసి హర్షితమౌతూ స్వయం కూడా సదా హర్షితంగా ఉంటూ, ఇతరులను హర్షితంగా చేస్తూ ఉండండి. ఎందుకంటే హర్షితముఖులు స్వతహాగానే ఆకర్షితమూర్తులుగా ఉంటారు. ఉదాహరణానికి స్థూలమైన నది తనవైపు ఆకర్షిస్తుంది కదా. ఆకర్షింపబడి యాత్రికులు వెళ్తారు. ఎంత కష్టపడవలసి వచ్చినా పావనంగా అయ్యే ఆకర్షణ లాక్కుంటుంది. కనుక పావనంగా చేసే కార్యానికి స్మృతిచిహ్నము యు.పిలో ఉంది. ఇటువంటి హర్షితమూర్తిగా, ఆకర్షణమూర్తిగా అవ్వాలి. అర్థమయిందా?.

మూడవ గ్రూపు విదేశీయులది. డబల్‌విదేశీయులు అనగా సదా విదేశి అయిన తండ్రిని ఆకర్షించేవారు ఎందుకంటే సమానంగా ఉండేవారు కదా. తండ్రి కూడా విదేశీయే, మీరు కూడా విదేశీయులే. ఒకే దేశము వారు ప్రియంగా ఉంటారు. తల్లిదండ్రుల కంటే స్నేహితులు ఎక్కువ ప్రియమనిపిస్తారు. కనుక డబల్ విదేశి అయిన తండ్రి సమానం సదా ఈ దేహము మరియు దేహ ఆకర్షణ నుండి విదేశీయులు అతీతంగా ఉంటారు, అశరీరులుగా ఉంటారు, అవ్యక్తంగా ఉంటారు. కనుక తండ్రి తమ సమానం అశరీరి, అవ్యక్త స్థితిలో ఉండే పిల్లలను చూసి హర్షితమవుతారు. రేస్ కూడా మంచిగా చేస్తున్నారు. సేవలో కూడా రకరకాల సాధనాలతో, రకరకాల పద్ధతులతో ముందుకు వెళ్లే రేస్ మంచిగా చేస్తున్నారు. విధి కూడా అవలంభిస్తారు, వృద్ధి కూడా చేస్తున్నారు. అందువలన బాప్‌దాదా నలువైపులా ఉన్న డబల్ విదేశీ పిల్లలకు సేవ చేసినందుకు అభినందనలు కూడా తెలుపుతున్నారు అంతేకాక స్వంత వృద్ధిని గురించిన స్మృతి కూడా ఇప్పిస్తున్నారు. స్వంత ఉన్నతిలో సదా ఎగిరేకళ ద్వారా ఎగురుతూ వెళ్లండి.

స్వఉన్నతి మరియు సేవలో ఉన్నతి రెండిటి బ్యాలన్స్ ద్వారా సదా తండ్రి ఆశీర్వాదాలకు అధికారులుగా ఉన్నారు. సదా ఉంటారు కూడా. అచ్ఛా.

నాల్గవ గ్రూపు వారు మధువన నివాసులు. వారు సదా ఉండనే ఉన్నారు. ఎవరైతే హృదయంపై ఉన్నారో వారు పొయ్యిపై, పొయ్యిపై ఉండేవారు హృదయంపై ఉంటారు. అందరికంటే ఎక్కువ విధి పూర్వక బ్రహ్మా-భోజనం కూడా మధువనంలో ఉంటుంది. అందరికంటే అపురూపమైన వారు కూడా మధువన నివాసులే. అన్ని ఫంక్షన్లు కూడా మధువనంలో జరుగుతాయి. అందరికంటే మురళిలు కూడా డైరక్టుగా మధువనం వారే వింటారు. కనుక మధువన నివాసులు సదా శ్రేష్ఠ భాగ్యానికి అధికారి ఆత్మలు. సేవ కూడా హృదయపూర్వకంగా చేస్తారు. అందువలన మధువన నివాసులకు బాప్‌దాదా మరియు సర్వ బ్రాహ్మణుల మనసా ఆశీర్వాదాలు ప్రాప్తి అవుతూ ఉంటాయి. అచ్ఛా.



నలువైపులా ఉన్న విశేషమైన సంతుష్టమణులకు బాప్‌దాదా యొక్క విశేషమైన ప్రియస్మృతులు జత జతలో సర్వ భాగ్యశాలి బ్రాహ్మణ జీవితాన్ని ప్రాప్తి చేసుకునే కోటిలో కొంతమంది, ఆ కొంతమందిలో కూడా కొంతమంది ఆత్మలకు, బాప్‌దాదా శుభ సంకల్పాలను సంపన్నం చేసే ఆత్మలకు, సంగమయుగీ జీవితం యొక్క ఆస్తికి సంపూర్ణ అధికారాన్ని ప్రాప్తి చేసుకునే ఆత్మలకు, విధాత మరియు వరదాత అయిన బాప్‌దాదా నుండి చాలా చాలా ప్రియస్మృతులు స్వీకరించండి.

దాదీ జానకి గారు మరియు దాది చంద్రమణి గారు సేవల కొరకు వెళ్లేందుకు బాప్‌దాదా నుండి శెలవు తీసుకుంటున్నారువెళ్తున్నారా లేక ఇముడ్చుకుంటున్నారా? వెళ్లండి మరియు రండి కాని సదా ఇమిడి ఉండండి. బాప్‌దాదా తమ అనన్యమైన పిల్లలను ఎప్పుడూ వేరుగా చూడనే చూడరు. ఆకారంలో గాని, సాకారంలో గాని సదా జతలోనే ఉంటారు. ఎందుకంటే కేవలం మహావీర పిల్లలే ప్రతి సమయంలో జతలోనే ఉంటాము, జతలోనే నడుస్తాము అనే ప్రతిజ్ఞను నిభాయిస్తారు. చాలా కొద్దిమంది మాత్రమే ఈ ప్రమాణాన్ని

నిభాయిస్తారు. అందువలన ఇటువంటి మహావీర పిల్లలు, అనన్యమైన పిల్లలు ఎక్కడకు వెళ్లినా తండ్రిని జతలో తీసుకెళ్తారు. బాప్‌దాదా వతనంలో కూడా వారిని జతలోనే ఉంచు కుంటారు ప్రతి అడుగులో తోడుగా ఉంటారు. అందువలన వెళ్తున్నారు, వస్తున్నారు - ఏమంటారు? అందువలన వెళ్తున్నారా లేక ఇముడ్చుకుంటున్నారా అని అడిగాము. ఇలాగే జతలో ఉంటూ ఉంటూ సమానంగా అయి ఇమిడిపోతారు. ఇంట్లో కొంచెం సమయం కొరకు విశ్రాంతి తీసుకుంటారు, జతలో ఉంటారు తర్వాత మీరు రాజ్యం చేస్తారు. తండ్రి పై నుండి చూస్తారు. కాని జతలో ఉండే కొంత సమయాన్ని అనుభవం చేయాలి. అచ్ఛా.

(ఈ రోజు బాబా తమ అద్భుతమైన మాలను తయారు చేశారు). మీరు కూడా మాలను తయారుచేస్తారు కదా. మాల ఇప్పుడింకా చిన్నదిగా ఉంది. ఇప్పుడు పెద్ద మాల తయారవుతుంది. ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లండి. మీరు వరదానీలుగా ఉండనే ఉన్నారు. మీరు వేసే ప్రతి అడుగు ద్వారా తండ్రి వరదానం అందరికి లభిస్తూ ఉంటుంది. మీరు చూచినా తండ్రి వరదాన దృష్టిని తీసుకుంటారు, మీరు మాట్లాడినా మాటల ద్వారా వరదానాలు తీసుకుంటారు, కర్మల నుండి కూడా వరదానాలే తీసుకుంటారు, నడుస్తూ - తిరుగుతూ వరదానాలను వర్షించేందుకు వెళ్తున్నారు. ఇప్పుడు ఏ ఆత్మలైతే వస్తున్నారో వారికి వరదానాలు మరియు మహాదానమే అవసరము. మీరు వెళ్లడం అనగా విశాల హృదయంతో వారికి తండ్రి వరదానాలు లభించడం. అచ్ఛా.

వరదానము :- " బుద్ధి రూపీ పాదం ద్వారా ఈ పంచ తత్వాల ఆకర్షణకు అతీతంగా ఉండే ఫరిస్తా స్వరూప భవ "

ఫరిస్తాలకు సదా ప్రకాశ శరీరాలనే చూపిస్తారు. ప్రకాశ శరీరం గలవారు ఈ దేహ స్మృతి నుండి కూడా అతీతంగా ఉంటారు. వారి బుద్ధి రూపి పాదము ఈ పంచ తత్వాల ఆకర్షణ నుండి ఉన్నతంగా అనగా అతీతంగా ఉంటుంది. ఇటువంటి ఫరిస్తాలను మాయ లేక ఏదైనా మాయావి కూడా టచ్ చేయలేదు. కాని మనం ఎవ్వరికీ అధీనం కానప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. శరీరానికి కూడా అధికారిగా అయి నడుచుకోవాలి, మాయకు కూడా అధికారిగా అవ్వాలి. లౌకిక లేక అలౌకిక సంబంధాలకు అధీనమవ్వరాదు.

స్లోగన్ :- " శరీరాన్ని చూచే అలవాటు ఉంటే లైట్ శరీరాన్ని చూడండి, లైట్ రూపంలో స్థితమై ఉండండి "

-: ఓంశాంతి :-